# దేశీయ, అంతర్జాతీయ వాణిజ్యం - పరిశీలన

**19వ శతాబ్దంలో స్వేచ్ఛావాణిజ్య విధానం బ్రిటన్‌లో ప్రాధాన్యం పొందింది. పశ్చిమ దేశాల్లో ఈ విధానంపై నమ్మకం పెంపొంది, రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ప్రపంచవ్యాప్తంగా వాణిజ్య నియంత్రణ కోసం GATT (గ్యాట్) ఏర్పాటైంది. ఆర్థికంగా శక్తిమంతమైన ముఖ్యంగా అమెరికా, ఐరోపా దేశాలు వ్యవసాయ రంగానికి సంబంధించి రక్షిత విధానాన్ని అనుసరిస్తూనే.. మరోవైపు స్వేచ్ఛా వాణిజ్య విధానాన్ని బలపరిచాయి. వీటితోపాటు నెదర్లాండ్స్, జపాన్, ఆస్ట్రేలియాలు సైతం స్వేచ్ఛా వాణిజ్యం పట్ల మొగ్గుచూపాయి. ఈ దేశాలన్నీ తయారీ రంగంలో మాత్రం రక్షిత విధానానికి ప్రాధాన్యమిచ్చాయి.**

తిరోగమన కాలంలో స్వదేశీ పరిశ్రమలను రక్షించడానికి దిగుమతి పన్నులు పెంచాలని ఆయా దేశాల్లో ఒత్తిడి పెరిగింది. ఈ స్థితి ఆర్థికమాంద్య కాలంలో కనిపించింది. ఇటీవల కాలంలో ఇలాంటి విధానాల్లో మార్పులొచ్చాయి. అమెరికా, ఐరోపా, జపాన్‌లోని వ్యవసాయలాబీలు వ్యవసాయానికి సంబంధించి మిగతా వస్తు, సేవలకన్నా ముఖ్య అంతర్జాతీయ వాణిజ్య ఒప్పందాలు ఏర్పడడానికి కారణమయ్యాయి. ఇండియా, చైనా, రష్యా వంటి దేశాలు అత్యంత శక్తిమంతమైన దేశాలుగా రూపొందిన తర్వాత స్వేచ్ఛా వాణిజ్య విధానం అవలంభించాయి. గత 50 ఏళ్ల కాలంలో అంతర్జాతీయ మార్కెట్‌లో పలు వ్యవస్థలు సంఘటితమైనాయి. అనేక పారిశ్రామిక దేశాల జాతీయ ఉత్పత్తిలో ఎగుమతులు, దిగుమతుల వాటా పెరిగింది. విదేశీ పెట్టుబడులు, అంతర్జాతీయరుణాలు పెరిగాయి. పారిశ్రామికీకరణ, రవాణా వ్యవస్థ మెరుగుపడటం, ప్రపంచీకరణ, బహుళజాతి సంస్థలు, ఔట్ సోర్సింగ్ వంటివి అంతర్జాతీయ వాణిజ్యవ్యవస్థపై తీవ్ర ప్రభావాన్ని చూపాయి. ప్రపంచీకరణకు అంతర్జాతీయ వాణిజ్య అభివృద్ధి ఎంతో అవసరం. అంతర్జాతీయ వాణిజ్యం లేనట్లయితే, వివిధ దేశాల వాణిజ్యం ఆయా దేశాల సరిహద్దుల వరకే పరిమితమవుతుంది.

## దేశీయ, అంతర్జాతీయ వాణిజ్యంలో తేడాలు:

### 1. ఉత్పత్తి కారకాలకు గమనశీలత లేకపోవడం :

దేశంలోని ప్రాంతాల మధ్య ఉత్పత్తి కారకాలకు స్వేచ్ఛాయుత గమనశీలత ఉంటుందని, అంతర్జాతీయ వాణిజ్యంలో దేశాల మధ్య గమనశీలత ఉండదనే అభిప్రాయంతో అంతర్జాతీయ వాణిజ్యానికి సంబంధించి సంప్రదాయ ఆర్థికవేత్తలు ప్రత్యేక సిద్ధాంతాన్ని రూపొందించారు. ఉత్పత్తి కారకాల కన్నా ధరలలోని మార్పులు దేశాల మధ్య వస్తు సేవల కదలికకు కారణమవుతాయి. భాషాపర తేడాలు, సంప్రదాయాలు, వృత్తిపర నేర్పులో తేడాలు, అధిక ప్రయాణ వ్యయాలు, కుటుంబ సాన్నిహిత్యం వంటివి శ్రామికుల్లో గమనశీలత లేకపోవడానికి కారణాలు. రవాణావ్యయాలు, రాజకీయ అనిశ్చితి, చట్టపరమైన సమస్యలు, బ్యాంకింగ్ వ్యవస్థలో అసంపూర్ణతలు, విదేశీ కరెన్సీల విలువలో స్థిరత్వం లేకపోవడం వంటివి మూలధన గమనశీలతను నియంత్రిస్తున్నాయి. శ్రామికులు, మూలధనం

గమనశీలతకు దేశాల మధ్య చట్టపరమైన అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇలాంటి సమస్యలు దేశీయ వాణిజ్యంలో తలెత్తవు.

**2. సహజ వనరుల లభ్యతలో తేడాలు:**

వివిధ దేశాల్లో సహజ వనరుల లభ్యత ఎక్కువగా ఉంటుంది. ఒక దేశం తమ వద్ద అధికంగా లభ్యమయ్యే వనరులతో వస్తూత్పత్తి జరిపి ఆ వనరులు కొరత ఉన్న దేశంతో వాణిజ్యం నెరపుతుంది. ఆస్ట్రేలియాలో భూవనరులు అధికంగా ఉన్నప్పటికీ శ్రామికులు, మూలధనం కొరత కనిపిస్తుంది. ఇంగ్లండ్‌లో మూలధనం చౌకగా లభ్యమయినప్పటికీ భూ వనరుల కొరత ఎక్కువ. మూలధనం ఎక్కువగా వినియోగిస్తూ తయారీ ఉత్పత్తులను ఇంగ్లండ్ ఎక్కువగా ఉత్పత్తి చేస్తుంది. గోధుమ, నూలు, మాంసం ఉత్పత్తికి ఎక్కువ భూమి అవసరం. కాబట్టి వీటిని ఆస్ట్రేలియా ఉత్పత్తి చేస్తుంది. సహజ వనరుల లభ్యత ఆధారంగా ఉత్పత్తి చేసే వస్తువులపై ఆయా దేశాలకు ప్రత్యేకీకరణ (Patent) లభిస్తుంది. ఉత్పత్తుల తయారీలో తులనాత్మక వ్యయంలో తేడాలు వివిధ దేశాల మధ్య వాణిజ్య సంబంధాలు మెరుగుకు దోహదపడతాయి.

**3. భౌగోళిక, వాతావరణంలో తేడాలు:**

ఏ దేశంలోనైనా అన్ని వస్తువుల ఉత్పత్తి చేపట్టడం సాధ్యంకాదు. దీనికి భౌగోళిక(Geographical), వాతావరణంలోని తేడాలే కారణం. కాఫీ ఉత్పత్తిలో బ్రెజిల్ అనుకూల వాతావరణాన్ని కలిగి ఉంటే, జౌళి ఉత్పత్తిలో బంగ్లాదేశ్, బీట్ షుగర్ ఉత్పత్తిలో క్యూబా అనుకూలమైన వాతావరణాన్ని కలిగి ఉన్నాయి. ఈ విధంగా భౌగోళిక, వాతావరణ పరిస్థితుల మేరకు తయారు చేసిన ఉత్పత్తులతో ప్రత్యేకీకరణ పొందిన దేశాలు ఇతర దేశాలతో వాణిజ్య సంబంధాలను ఏర్పరచుకుంటాయి.

**4. మార్కెట్ తేడాలు:**

భాష, అలవాట్లు, అభిరుచుల తేడాలు అంతర్జాతీయ మార్కెట్లతో దేశీయ మార్కెట్లు వేరుకావడానికి కారణమవుతున్నాయి. యంత్రాలు, యంత్ర పరికరాల లభ్యతలో దేశాల మధ్య తేడాలు కనిపిస్తున్నాయి. బ్రిటీషువారు భారతదేశాన్ని పరిపాలించే కాలంలో వినియోగ వస్తు పరిశ్రమలను అభివృద్ధి చేశారు. ఆర్థికాభివృద్ధి సాధనలో ప్రధాన పాత్ర వహించే మూలధన వస్తువులను తమ దేశంలో తయారుచేస్తూ వాటిని వివిధ మార్కెట్లలో విక్రయించేవారు. భారతదేశాన్ని ముడిసరకుల ఎగుమతి దేశంగా, తయారీ ఉత్పత్తుల మార్కెట్‌గా ఉపయోగించుకున్నారు. అనేక సందర్భాలలో ఇతర దేశాలలో విక్రయించే ఉత్పత్తులను తమ దేశ లక్షణాలకనుగుణంగా రూపొందిస్తారు. ఇదే విధంగా భారత్‌లో right hand driven cars వినియోగిస్తారు.

**5. వస్తు గమనశీలత :**

దేశీయ, అంతర్జాతీయ మార్కెట్ల మధ్య వస్తు గమనశీలతలో తేడాలున్నాయి. దేశంలో వస్తు గమనశీలతను రవాణా వ్యయాలు, geographical distances నియంత్రిస్తాయి. దేశాల మధ్య వస్తు గమనశీలతకు దిగుమతుల పన్నుతో పాటు కోటాలు, లైసెన్సులు లాంటి అనేక నియంత్రణలు ఉంటాయి.

**6. కరెన్సీలో తేడాలు :**

దేశీయ వాణిజ్యంలో ఒకే కరెన్సీ వినియోగంలో ఉంటుంది. దీనికి భిన్నంగా విదేశీ వాణిజ్యంలో అనేక కరెన్సీలను వినియోగించడం దేశీయ, అంతర్జాతీయ వాణిజ్యంలో తేడాలకు కారణమైంది. భారత్‌లో ఉత్తరం నుండి దక్షిణ ప్రాంతం వరకు, తూర్పు నుంచి పశ్చిమం వరకు 'రూపాయి' ప్రామాణిక ద్రవ్యం. మన దేశస్థులు నేపాల్ లేదా పాకిస్తాన్ వెళ్ళినట్లయితే వస్తు, సేవల కొనుగోలుకు మన రూపాయిని ఆయా దేశాల కరెన్సీలోకి మార్చుకోవాల్సి ఉంటుంది. అంతర్జాతీయ వాణిజ్యంలో కరెన్సీల్లోనే కాకుండా వాటి సాపేక్ష విలువల్లో తేడాలుంటాయి. అంతర్జాతీయ వాణిజ్యంలో అమెరికా డాలర్, బ్రిటన్ పౌండ్ (Pound), యూరో, జపాన్ యెన్ కరెన్సీలు ఎక్కువ వినియోగంలో ఉన్నాయి. పలు దేశాలు వివిధ ద్రవ్య, విదేశీ మారక ద్రవ్య విధానాలను అవలంభించడం వల్ల ఎగుమతుల సప్లయ్ లేదా దిగుమతుల డిమాండ్ ప్రభావం ఎక్కువగా ఉంటుంది. వివిధ దేశాల కరెన్సీ కన్నా విధానాల్లో తేడాలే దేశీయ వాణిజ్యాన్ని విదేశీ వాణిజ్యం నుంచి వేరు చేస్తున్నాయని Kindle Berger అభిప్రాయపడ్డారు.

**7. చెల్లింపుల శేషం సమస్య :**

విదేశీ వాణిజ్యాన్ని దేశీయ వాణిజ్యం నుండి వేరు చేసే ముఖ్య అంశం చెల్లింపుల శేషం సమస్య. దేశాల మధ్య కన్నా దేశంలో వివిధ ప్రాంతాల మధ్య మూలధన గమనశీలత ఎక్కువ. కాబట్టి, దేశీయ వాణిజ్యంలో ఈ సమస్య ఉండదు. చెల్లింపుల శేషంలో అసమతౌల్యాన్ని నివారించడానికి ఒక దేశం అవలంభించే విధానాలు కొన్ని ఇతర సమస్యలకు దారి తీస్తాయి. ప్రతి ద్రవ్యోల్బణం లేదా మూల్యనీకరణ లేదా దిగుమతులపై నియంత్రణలు లేదా కరెన్సీ గమనశీలతపై నియంత్రణ వంటి చర్యలు ఇతర సమస్యలకు దారి తీసేలా చేస్తాయి. ఇలాంటి సమస్యలు దేశీయ వాణిజ్యంలో ఉండవు.

**బెర్టిల్ ఓలిన్ అభిప్రాయాలు :**

దేశీయ వాణిజ్యం, అంతర్జాతీయ వాణిజ్యానికి మధ్య తేడా చాలా స్వల్పమని బెర్టిల్ ఓలిన్ అభిప్రాయపడ్డారు. సంప్రదాయ ఆర్థిక వేత్తల అభిప్రాయంతో ఓలిన్ ఏకీభవించలేదు. ఆయన అభిప్రాయంలో శ్రామికులు, మూలధనం ఒక దేశంలోని వివిధ ప్రాంతాల మధ్య కూడా తక్కువ గమనశీలత కలిగి ఉంటాయి. ఒకే దేశంలో వివిధ వాణిజ్యాల్లో వేతన రేట్లలో తారతమ్యాలు ఉన్నట్లే ఒకే వాణిజ్యంలో వివిధ ప్రాంతాల మధ్య వేతనరేట్లలో తేడాలుంటాయని ఓలిన్ అభిప్రాయపడ్డారు.

ఓలిన్ అభిప్రాయం-ప్రకారం దేశాల మధ్య శ్రామికులు, మూలధనానికి గమనశీలత లేకపోవడం అనేది ఉండదు. శ్రామికులు, మూలధనం ఒక దేశం నుంచి మరొక దేశానికి చలిస్తుంటాయి.

అమెరికా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, కెనడా, లాటిన్ అమెరికాలో 19, 20 శతాబ్దాల్లో జరిగిన అభివృద్ధికి ఇంగ్లండ్, ఐరోపా నుంచి శ్రామికులు, మూలధనం గమనశీలతే కారణం. ఓలిన్ అభిప్రాయంలో అంతర్జాతీయ వాణిజ్యంలో కరెన్సీల్లో తేడాలు ఉన్నప్పటికీ ప్రత్యేక సిద్ధాంతాల రూపకల్పన అవసరం లేదు. రెండు దేశాల మధ్య వినిమయ రేటు ఆయా దేశాల కరెన్సీల కొనుగోలు శక్తికి అనుసంధానించి ఉంటుంది. కనుక ఒక దేశ కరెన్సీ మరొక దేశ కరెన్సీతో మార్చుకొనే అవకాశం ఉన్నందున దేశీయ వాణిజ్యం, అంతర్జాతీయ వాణిజ్యం మధ్య తేడా లేదు. తులనాత్మక వ్యయసిద్ధాంతం అంతర్జాతీయ వాణిజ్యానికే కాకుండా దేశంలోని అన్ని వ్యాపారాలకు వర్తిస్తుంది.